

డొంకూరు తీర ప్రాంతంలో స్వచ్ఛ సాగర్

ఇచ్ఛాపురం : అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం మండలంలో డొంకూరు తీర ప్రాంతంలో స్వచ్ఛ సాగర్ సురక్ష సాగర కార్యక్రమం నిర్వహించారు. ఇన్కాయిస్, సంస్థ మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తంగా అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం, స్వచ్ఛ భారత్ లో భాగంగా స్వచ్ఛ సాగర్ సురక్ష సాగర కార్యక్రమ నిర్వహించారు. ఆ సంస్థ ప్రతినిధి టి. రాజశేఖర్ స్వచ్ఛత ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో బారువ మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్, ఉమెన్ ఎస్సై శిరీష, ఎఎస్ఐ మాధవరావు, గ్రామ సర్పంచ్ రిషి, సొసైటీ సభ్యుడు, ఎంఎస్ఎస్ మెంబర్ గురుమూర్తి, మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు పాల్గొన్నారు.



స్వచ్ఛ సాగర్ నిర్వహిస్తున్న మత్స్యకారులు, అధికారులు

ఊరిస్తూ... ఉసూరనిపిస్తూ

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో లోటు వర్షపాతం
- ఎండిపోతున్న పంట పొలాలు
- వరుణుడి కరుణ కోసం రైతుల ఎదురుచూపులు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వరుణుడు ఊరించి ఉసూరనిపిస్తున్నాడు. మబ్బులతో దోబూచులాడి... చినుకులతో సరిపెడుతున్నాడు. కారుమబ్బులు కమ్ముకున్నచోట కూడా కాసిన్ని చినుకులకే పరిమితమవుతున్నాడు. దీంతో పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి. నియోజకవర్గంలో లోటు వర్షపాతం వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వెరసి కర్షకుని పరిస్థితి కడు దయనీయంగా మారుతోంది.


రాజపురంలో ఎండిపోయిన నారుమడి

ప్రజాశక్తి - కవిటి

ఇచ్ఛాపురం నియోజవర్గంలో ఏ ఇద్దరు రైతులు ఎదురైనా వర్షం కోసమే మాటలు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాకాలం సగం పూర్తయినా ఇప్పటికీ నియోజకవర్గంలో లోటు వర్షపాతం నమోదైంది. ఉదాహరణకు కవిటి మండలాన్ని తీసుకుంటే జూన్‌లో -78.1 శాతం లోతు వర్షపాతం నమోదైతే, జూలైలో -11.5, ఆగస్టులో -81.3 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇక నియోజకవర్గంలోని మిగతా మూడు మండలాల పరిస్థితి అదే విధంగా ఉంది.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా అటు కరువు మండలాలకూ చెందక, ఇటు పుష్కలంగా పంటలూ పండక నాలుగు మండలాల రైతుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. వాస్తవానికి ఓవైపు నారుమళ్లు ఎండిపోతుంటే, మరోవైపు వరిచేలు వరుణుడి కోసం ఎదురుచూస్తున్నాయి. కనీసం ఇప్పుడు వరుణుడు కరుణించినా చాలా నారుమళ్లు ఉడుపులకు పనికిరావు. సరైన వర్షాల్లేక ఉన్న పంట కూడా పూర్తిస్థాయిలో పండి దిగుబడి ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

కష్టాలతో ఖరీఫ్ సాగు



నేను ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఆగస్టు ప్రారంభంలో వచ్చిన వర్షానికి దమ్ము చేసి నాట్లు వేశాను. ఇప్పటివరకు సుమారు రూ.53 వేలు ఖర్చు చేశాను. ప్రస్తుత పరిస్థితి దయనీయంగా ఉంది. చినుకు జాడ లేక పైరు పాలిపోతోంది. కారుమబ్బులు కమ్ముకున్న రోజు కూడా కాసిన్ని చినుకులే రాలుతున్నాయి. దీంతో కష్టాల నడుమ ఖరీఫ్ సాగు చేస్తున్నాం. పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం. **- పుల్లట ప్రసాదరావు, రైతు, బైరిపురం, కవిటి**


పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మోహనరావు

విశాఖ ఉక్కు పరిరక్షణ బైక్ యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పలాస, రణస్థలం, కొత్తూరు

ప్రభుత్వరంగ పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయాలని చూస్తుందని, ప్రయివేటీకరణ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ... సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుంచి ఉత్తరాంధ్ర బైక్ యాత్ర నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో ఆదివారం బైక్ యాత్ర పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అనేక పోరాటాల ఫలితంగా ప్రజల బలిదానంతో ఏర్పాటు చేయచేసిన ప్రభుత్వ రంగ కర్మాగారమని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దానిని ప్రయివేటు కార్పొరేట్లకు అమ్మేయాలని చూస్తుందన్నారు. ప్రభుత్వానికి రెవెన్యూ లోటు ఏర్పడి, కార్మికులకు ఉద్యోగ భద్రత లేక, భవిష్యత్ తరాలకు ఉపాధి లేకుండా చేసే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమగా ఉండి ఉత్తరాంధ్ర, రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఇటువంటి సంస్థను కాపాడుకోవడం ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగమని అన్నారు. ప్రయిటీకరణకు వ్యతిరేకంగా గత వెయ్యి రోజులుగా రిలే నిరాహారదీక్షలు జరుగుతున్నాయని వివరించారు. కేంద్రం ప్రభుత్వం ఈ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఉత్తరాంధ్ర ప్రజలను చైతన్య పరుస్తూ బైక్ ర్యాలీ చేపడుతున్నామని, 22న సాయంత్రం నాలుగు గంటలకు కాశీబుగ్గకు ఈ బైక్ ర్యాలీ చేరుతుందని తెలిపారు. ర్యాలీలో పాల్గొని ఉక్కు పరిశ్రమను కాపాడు కోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, వి.కృష్ణారావు, పి.పరుశురాం, డి.కిషోర్, ఎ.వీరాస్వామి పాల్గొన్నారు.

అలాగే ఈ నెల 20న సాయంత్రం ఎచ్చెర్లలో ప్రారంభం కానున్న ఉక్కు రక్షణ బైక్ యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ నాయుకులు వెలమల రమణ, సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలం సిపిఎం కార్యాలయం వద్ద బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ నెల 23న కొత్తూరులో సాయంత్రం నిర్వహించనున్న విశాఖ ఉక్కు రక్షణ బైక్ యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

21 నుంచి యుటిఎఫ్ స్వర్ణోత్సవాల జాతా

రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

శ్రీకాకుళం అర్బన్ : ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు స్వర్ణోత్సవ జాతా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం మధ్యంతర కౌన్సిల్ సమావేశం అధ్యక్షులు పొందూరు అప్పారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సంతాప తీర్మానాలు, నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, ఆర్థిక నివేదికను కోశాధికారి బి.శ్రీరామ్మూర్తిలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాతా ఈ నెల 21న ఇచ్ఛాపురంలో ప్రారంభమై సోంపేట, హరిపురం, పలాస, టెక్కలి నరసన్నపేట, శ్రీకాకుళం వరకు సాగుతుందన్నారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ రెండూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ అనంతరం తీవ్ర నష్టాన్ని చేకూరుస్తాయని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఉద్దేశపూర్వకంగానే విషం చిమ్ముతున్నారని,రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ చేపడతామని జెవివి రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, జిల్లా కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డి మోహనరావు

వినాయక చవితి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఆమదాలవలస, శ్రీకాకుళం అర్బన్

తెలుగు ప్రజలు సోమవారం జరుపుకునే వినాయక చవితి ఉత్సవం పర్యావరణహితంగా నిర్వహించాలని, ప్రతిఇంటా సంతోషాలతో వర్ధిల్లాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తెలుగు ప్రజానీకానికి ఆదివారం స్పీకర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ గణపతిని మట్టితోనే రూపొందించి పూజలు నిర్వహించుకోవాలన్నారు. పిల్లలు పెద్దలు ఇష్టంగా జరుపుకునే పండుగల్లో వినాయక చవితి మొదటిది అన్నారు. వినాయకుడిని ప్రతిష్టించేందుకు మండపాలు, పందిళ్ల నిర్మాణాలు కొనసాగుతున్న సమయంలో కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉపయోగించి తయారు చేసిన రంగులతో కూడిన విగ్రహాలను వినియోగించవద్దని కోరారు. తొమ్మిది రోజులు పాటు సాగే ఈ సంబరాల్లో పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. మన పనుల వల్ల ఎదుటివారికి, భవిష్యత్ తరాలకు కష్టం రాకూడదన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు.

తెలుగు ప్రజలు ఎంతో సంతోషంగా గడుపుకునే తొలి పండగ వినాయక చవితి అని, సోమవారం జరగనున్న వినాయక చవితి వేడుకలు ప్రతిఇంటా జరుపుకుని ఆనందంగా ఉండాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలోని కార్మిక, కర్షక ఉపాధ్యాయ, ఉద్యోగులకు, విద్యార్థినీ, విద్యార్థుల ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

చవితి శోభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసు నిబంధనలకు లోబడి వాడవాడలా మండపాలను సిద్ధం చేస్తున్నారు. చవితి వేడుకలకు అవసరమైన సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. వేడుకలకు అవసమయ్యే సామగ్రిని కొనుగోలు చేసేందుకు జనం పోటెత్తారు. దీంతో శ్రీకాకుళం నగరం, పలాస పట్టణంలోని ప్రధాన కూడళ్లు కిటకిటలాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు జనం తరలిరావడంతో పెద్దఎత్తున కొనుగోళ్లు సాగాయి. ఆదివారం సెలవు దినం కావడంతో పండగ వ్యాపారాలు బాగా సాగాయి. పూజా సామగ్రికి అవసరమైన ఆరు రకాల ఫలాలను రూ.70, పువ్వులు కేజీ రూ.120 నుంచి రూ.150 వరకు వ్యాపారులు విక్రయించారు. మట్టి వినాయకులు, కుమ్మరి బొమ్మలు, పండ్లు, పత్రి, ఇతర పూజా సామగ్రిని విక్రయించుకుని ఉత్సవాలకు సిద్ధం చేసుకుంటున్నారు. పెద్దఎత్తున మట్టి బొమ్మలను వివిధ సంఘాలు, వ్యాపార సంస్థలు, రాజకీయ నాయకులు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి బొమ్మలు రూ.30 నుంచి రంగుల బొమ్మలు రూ.వేలాదిగా ధరలు నిర్ణయించారు. బొమ్మను బట్టి ధర నిర్ణయించి విక్రయించగా పూజా సామగ్రి, పళ్లు, పువ్వుల ధరలు ఆకాశాన్ని అంటాయి. వినాయక చవితి సందడి మార్కెట్‌లో వ్యాపారులకు కాసులు కురిపించగా... సామాన్యులకు ఈ పండగ భారంగా మారింది.


పలాస : కిటకిటలాడుతున్న ప్రధాన మార్కెట్


పలాస : పువ్వులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

ధర్మాన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

ఫ్యాప్టో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలను మభ్య పెట్టేందుకు సభలు, సమావేశాల్లో చేసే ప్రసంగాల్లో ఉపాధ్యాయులపై అక్కసు వెల్ల గక్కడం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు తగదని, ఫేసియల్ యాప్‌కు, తంబ్‌కు మధ్య వ్యత్యాసం తెలియకుండా ఆయన వ్యాఖ్యలు చేయడం సరికాదని జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ధ్వజమెత్తారు. ఈ మేరకు ఫ్యాప్టో సంఘాల జిల్లా చైర్మన్ మజ్జి మదన్ మోహన్, సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు, యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పొందూరు అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రవేశపెట్టిన తంబ్ అటెండెన్స్‌ను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించలేదని, కానీ, తంబ్ స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం ఫేషియల్ యాప్ ప్రవేశపెట్టిన తర్వాత ఉపాధ్యాయుల వ్యక్తిగత గోప్యతకు భంగకరమని భావిస్తున్నామని అన్నారు. నాడు-నేడు పనులు మొదటి దశలో రూ.లక్షల ఖర్చు చేసి ప్రాథమిక పాఠశాలలో వసతులు కల్పించిందన్నారు. ఏడాది తిరక్కుండానే ఈ పాఠశాలలనే మూసివేసి 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు పంపించారన్నారు. విద్యారంగానికి నష్టదాయకమైన ఈ విధానాన్ని అన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయని గుర్తుచేశారు. విద్య రంగానికి పాఠశాలలకు నష్టదాయకమైన జిఒ నంబరు 117, బదిలీల పేరుతో ప్రాథమికోన్నత పాఠశాలలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను రద్దు చేసిందన్నారు. బదిలీల అనంతరం జిఒ 60ను విడుదల చేసి రెండు నెలల తిరగకుండానే వర్క్ అడ్జస్మెంట్ పేరుతో యుపి పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లను అడ్జస్ట్ చేస్తున్నారని అన్నారు. ఇది విద్యారంగ తిరోగమన చర్యా? పురోగమన చర్యా? మంత్రి ధర్మానే చెప్పాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో బల్ల సుభాష్‌బాబు, పి.తమ్మి నాయుడు, ఎస్.వి.రమణమూర్తి, టెంక చలపతిరావు, వి.కామేశ్వరరావు, పి.కృష్ణారావు, పి.హరిప్రసన్న, పేకేటి రామారావు, పి.ప్రతాప్‌కుమార్, కొప్పల డేనియల్, రామారావు, ఎస్.గోవిందరాజులు ఉన్నారు.

సైకో జగన్ ఇంటికే...

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

సైకో మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద 'మేము సైతం రిలే నిరాహార దీక్ష'కు ఆదివారం సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సిఎం జగన్ పరిపాలనలో చేస్తున్న అవినీతిని ప్రశ్నించడమే మాజీ సిఎం చంద్రబాబు నాయుడు చేసిన తప్పు అని ప్రశ్నించారు. అవినీతిపరులుగా చిత్రీకరించడానికి చేసిన ప్రయత్నమే చంద్రబాబు అరెస్టుకు నిదర్శనమని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే ఏర్పడిన శాసన, చట్ట, న్యాయవ్యవస్థలకు కొన్ని అధికారాలు పరిమితులు ఉన్నాయని అన్నారు. జగన్ పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. చట్టం, రాజ్యాంగం తమకు తెలుసునని, వాటిని ధిక్కరించి ప్రవర్తించే అధికారం పోలీస్ యంత్రాంగానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సీమెన్స్ కంపెనీ ఒప్పందంలో అప్పటి చీఫ్ సెక్రటరీగా ఉన్న అజయ్ కల్లం, ప్రేమ చంద్రారెడ్డిల తప్పు లేనప్పుడు చంద్రబాబు అవినీతి చేశారని, ఎలా అరెస్టు చేశారని, ఇది రాజకీయ కక్షతో చేసిన అరెస్టు అని దుయ్యబట్టారు. ప్రజలకు ఒక చేత్తో రూ.వంద ఇచ్చినట్టే ఇచ్చి... దానికి పది రెట్లు ప్రజల నుంచి దోచుకుంటున్న ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని అబద్ధపు హామీనిచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే మడమ తిప్పాడని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపదరావు మురళి, తమ్మినేని విద్యాసాగర్, తమ్మినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కూన రవికుమార్

సమర్థవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- ప్రజలకు వైద్యం అందించడమే లక్ష్యం
- క్షేత్ర స్థాయిలో ఇంటింటా సర్వే పూర్తి
- 30 నుంచి గ్రామగ్రామాన వైద్య శిబిరాలు
- కేన్సర్‌పై అవగాహనా కార్యక్రమాలు
- డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సమర్థవంతంగా జరపడానికి అవసరమైన పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని, ఈ నెల 30 నుంచి గ్రామాల్లో ఇంటింటికీ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. క్షేత్ర స్థాయిలో వాలంటీర్లు అన్ని కుటుంబాలనూ సందర్శించి ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తిస్తున్నారని తెలిపారు. వారిచ్చిన నివేదికల ఆధారంగా ఎఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ల (ఎంఎల్‌హెచ్‌పిలు)లు ఇంటింటికీ వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో వైద్యా శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యం అందించడానికి వీలవుతుందన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించామని చెప్పారు. శిబిరాల్లో ప్రజలకు అవసరమైన మందులు అందిస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా దీర్ఘకాలిక, గుండె సంబంధిత, కాలేయ, కిడ్నీ సంబంధిత రోగాలు ఉన్నట్లు గుర్తిస్తే వారికి మెరుగైన వైద్యం కోసం పంపిస్తామని అన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పాటు జిల్లాలో అందిస్తున్న వైద్య సేవలపై ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? నిర్వహణకు ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి?

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో, వార్డుల్లో సమర్థవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఇంటింటా సర్వే, వైద్య పరీక్షలు పూర్తి చేసి రోగగ్రస్థులను గుర్తించే ప్రక్రియ సాగుతోంది. ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ప్రధానంగా దీర్ఘకాల ప్రాణాంతక రోగాలను గుర్తించడానికి వీలుగా ఇంటింటా సర్వే చేపట్టాం. వాలంటీర్లు సర్వే నిర్వహించి ఇచ్చిన నివేదికల ఆధారంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. శిబిరాలకు ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు పిహెచ్‌సి డాక్టర్లు హాజరవుతారు. రోగులకు గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తాం.

? కేన్సర్ రోగులను గుర్తించడానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

కేన్సర్ వ్యాధి ప్రాణాంతకమే అయినా సకాలంలో గుర్తించడం ద్వారా నయం చేసేందుకు వీలుంటుంది. ప్రధానంగా ఈ వ్యాధి నిర్ధారణపై ప్రజల్లో అవగహన అవసరం. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేన్సర్ రోగాన్ని గుర్తించడానికి వీలుగా వ్యాధి నిర్ధారణ సకాలంలో చేపట్టేందుకు మహాత్మా గాంధీ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సర్జికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యాన వైద్యులకు అవగాహన కల్పించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన లేక పోవడం వల్ల సకాలంలో వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో గ్రామస్థాయిలో అవగాహన కల్పించి వ్యాధిగ్రస్తులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు వీలుంది. ప్రతి సోమవారమూ రిమ్స్ ఆస్పత్రికి కేన్సర్ అనుమానం ఉన్న రోగులను పంపిస్తే మహాత్మ గాంధి కేన్సర్ ఆస్పత్రి డాక్టర్ పి.వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యాన సర్జికల్ ఒపి నిర్వహించనున్నారు. ప్రధానంగా భాగంగా నోటి కేన్సర్, లంగ్ కేన్సర్, గర్భాశయ కేన్సర్, బోన్ కేన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడానికి వీలుంటుంది.


డాక్టర్ బి.మీనాక్షి, డిఎంహెచ్‌ఒ



? సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాలైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధులు ప్రబలడానికి కారణాలను గుర్తించి సంరక్షణా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో దోమల బెడద అధికంగా ఉంటోంది. పరిసరాల పరిశుభ్రత లేని కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటివల్ల ప్రధానంగా ప్రాణాంతక వ్యాధులైన మలేరియా, డెంగీ, సెరిబ్రల్ మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏటా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. పారిశుధ్య నిర్వహణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. వీధుల్లో పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నేల బావులు, తాగునీటి పథకాలు, మురుగు నీటి నిల్వ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేయిస్తున్నాంన. ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉంటే తగిన చర్యలు తప్పవు.

? జిల్లాలో మలేరియా, డెంగీ, విషజ్వరాల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. వాతవరణంలో వస్తున్న మార్పుల వల్ల జ్వరాలు పెరిగే అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. వడకాచిన నీరు తాగడం, మితంగా తినడం, జ్వరం లక్షణాలు ఉన్నట్టు గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా త్వరతిగతిన నయం చేసకోవచ్చు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో కొన్ని లోపాలు ఉండడంతో దోమలు బెడద ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల జ్వరాల బారి పడతారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధులు తప్పవు. మలేరియా, డెంగీ వ్యాధులు దోమల నుంచే సంక్రమిస్తాయి. ప్రతిఒక్కరూ దోమల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలి. దోమల నుంచి సంరక్షణ పొందడానికి తగిన జాగ్రత్తలు పాటించాలి. డెంగీ, సెరిబ్రల్ మలేరియా వంటి వ్యాధుల బారిన పడితే రూ. లక్షలాదిగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

? మలేరియా నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

మలేరియా నియంత్రణకు జిల్లాలో హైరిస్క్ గ్రామాలను గుర్తించాం. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లాలో లక్షల సంఖ్యలో గంబూషియా చేపలను హైరిస్క్ ప్రాంతాల్లో పెద్ద నీటి నిల్వలు ఉన్నచోట విడిచిపెట్టేందుకు చర్యలు చేపట్టాం. గిరిజన ప్రాంతాల్లో మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు దోమతెరలను ఏటా పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడాదీ ముందస్తుగా జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేశాం. దోమలు కుట్టకుండా ఉండేందుకు పూర్తిగా వస్త్రధారణ తప్పని సరి. డెంగీ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు టెక్కలిలో ఉన్న కేంద్ర ఆస్పత్రిలోనే చేపడుతుంది. మలేరియా, డెంగీ రాకుండా ముందస్తు నివారణ చర్యలు పాటించడం మేలు.


ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో మంత్రి ధర్మాన

నగదు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తాము ఎంత వృద్ధిలోకి వచ్చినా, ఎంతటి ఉన్నత స్థితిలో ఉన్నా తల్లిదండ్రులపై ప్రేమాభిమానాలతో మెలగాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నగరాల సామాజిక తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు ప్రతిభా స్కాలర్‌షిప్‌లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర సంఘం కోశాధికారి బి.వి.రమణశర్ తన తల్లిదండ్రులపై ఉన్న అపార గౌరవభావంతో బెవర ముకుందరావు, జయలక్ష్మి, కొరికాన అనంత గోవిందరావు పేరిట ట్రస్టు ప్రారంభించి ప్రతిభావంతులైన పది, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ప్రతిభా స్కాలర్ షిప్‌లు అందజేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, నగరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పిల్లా ఆనందరావుపాత్రుడు, సంఘం కార్యదర్శి పంచు రాజుగోపాల్, వాకర్స్ మాజీ గవర్నర్ కూన వెంకటరమణమూర్తి, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, మాజీ కోశాధికారి ఎం.మల్లిబాబు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

వైసిపిది నియంతృత్వ పోకడలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి గుండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తూ... నియంతృత్వపు పోకడలను అవలంబిస్తోందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ధ్వజమెత్తారు. నగరంలోని క్రాంతి భవన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నేతలు, ప్రజా ఉద్యమాలపై పోలీసుల అణచి వేత చర్యలను నిరసిస్తూ ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చి కక్షసాధింపు పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. 40 ఏళ్ల పాటు నిష్కలంక రాజకీయాలు చేసిన చంద్రబాబును ఉద్దేశపూర్వకంగా కేసులో ఇరికించి అరెస్టు చేశారని అన్నారు. జిల్లాలో ఉన్న మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులకు చంద్రబాబుపై మాట్లాడే అర్హత ఎక్కడుందన్నారు. గతంలో జైలుకు వెళ్లి జగన్‌కు భూములు కేటాయించడంలో ధర్మాన పాత్రను ప్రజలు మరచిపోలేదని సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు జవాబుదారులుగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు చిక్కాల గోవిందరావు, షణ్ముఖరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు


బూర్జ : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నిరసనలు ఐదో రోజూ కొనసాగాయి. అందులో భాగంగా జిల్లాలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో 'బాబుతో నేను' తోడుగా.. నియంతపై పోరాటానికి మేము సైతం' పేరిట నిరాహార దీక్షలను గురువారం చేపట్టారు.

నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద తెలుగు యువత మోకాళ్లపై కూర్చుని వినూత్న నిరసన తెలిపారు. అనంతరం రిలేనిరాహార దీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, విశాఖ నగర సౌత్ నియోజకవర్గ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జిల్లా తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం ఆవరణలో తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపిలు నిర్వహించిన సామూహిక నిరాహారదీక్షలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలమల విజయలక్ష్మి, కర్రి అప్పారావు, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బంగ ప్రహర్ష పాల్గొన్నారు.

బూర్జ మండలంలో ఆదివారం రాత్రి అల్లెన గ్రామం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైకాపా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వావిలపల్లి సీతారాం బాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వి. రాంబాబు, పి. హరిబాబు , ఆంజనేయులు పాల్గొన్నారు.

పలాసలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారంతో ఐదో రోజుకు చేరుకుంది. రిలే నిరాహారదీక్షలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి టిడిపి నాయకులు కూర్చొన్నారు. ముందుగా దీక్షలో కూర్చున్న నాయకులకు గౌతు శిరీష నలుపు కండువాలను వేసి దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, సతీమణి విజయలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న నేను సైతం రిలే నిరాహార దీక్షలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ పిలుపుమేరకు నియోజకవర్గ ఎంఆర్పీఎస్ ఇంచార్జ్ లోపింటి నారాయణరావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ర్యాలీగా వచ్చి మద్దతు తెలిపారు. గారబ కొల్లివలస, పార్వతీశంపేట, గాంధీనగర్, తిమ్మాపురం, నిమ్మ తొర్లాడ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


పలాస : రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న గౌతు శిరీష

మెళియాపుట్టి మండలం రట్టిని గ్రామస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో కిశోర్ చంద్రదాస్, పవిత్ర సామ్యులు, ప్రశాంత్, ప్రసాద్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం మండలం తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు కోష్ట మాజీ సర్పంచ్ పిషిణి జగన్నాథం ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు,. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కోష్ట ఎంపిటిసి పిషిణి ఆశిరినాయుడు, మండల యువ నాయకులు పిషిణి హరి పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

జలుమూరు : నరసన్నపేట మండలంలోని జమ్ము జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలంలోని నగిరికటం పంచాయతీ పరిధి మెట్టపేటకు చెందిన విద్యార్థి పైల సాయికుమార్ దుర్మరణం చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయికుమార్ తల్లిదండ్రులు జయలక్ష్మి, రాజేశ్వరరావు హైదరాబాద్లో వలస కూలీలుగా పని చేస్తున్నారు. తాత ఇంటి వద్ద కొత్తపేటలో ఉండి చదువుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హైదరాబాద్ నుంచి స్వగ్రామం వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

క్రీడా పోటీల్లో పొందూరు విద్యార్థుల ప్రతిభ

పొందూరు : జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలకు పొందూరు ప్రభుత్వఉన్నత పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. నియోజకవర స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచిన బి.నవీన్, వై. అప్పలనాయుడు, జస్వంత్, షేక్ సల్మాలు, వాలీబాల్ విభాగంలో కుమార సాయి, యోగాలో కె. గుణశేఖర్. అథ్లెటిక్స్‌లో దిలీప్. చాందిని, బాడ్మింటన్ లో గౌతమ్, జగదీష్‌లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిడి దండా, ఉదయ్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సామాజిక దృక్పథం అవసరం

టెక్కలి : ద్రావిడ ఉద్యమ వ్యవస్థాపకులు హేతువాది పెరియార్ రామస్వామి ఆలోచనాపరంగా ప్రస్తుత సమాజానికి సామాజిక దృక్పథం అవసరమని సమతా సైనిక్ దల్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు అన్నారు. స్థానిక బిసి బాలికల వసతిగృహంలో ఆదివారం రామస్వామి జయంతి వేడుక నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామస్వామి కులనిర్మూలనా వ్యవస్థలో ఆయన చూపిన మార్గం అనుసరణీయమని అన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దల్ కార్యకర్తలు నాగేశ్వరరావు, బంగారి తాతారావు, మేట్రిన్ శ్రావణి, వాసు, రంగారావు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో తాగునీటి సౌకర్యం

జి.సిగడాం : తాగునీరు అందక జి సిగడాం మండలం, మధుపాం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ విషయాన్ని ఆ గ్రామ మహిళలు సర్పంచి బోగాది అప్పలనాయుడుకి తెలియజేయగా వెంటనే స్పందించి తన సొంత ఖర్చుతో ఆదివారం కొత్తగా వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. త్వరితగతిన పరిష్కరించినందుకు గ్రామస్తులు అభినందించారు. గతంలో కూడా పోలాకి దాలయ్య ఇంటి ఆవరణలో సర్పంచ్ ఆధ్వర్యంలోనే వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

రూ .20 వేల ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన బొడ్డు రమేష్ గత కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఆదివారం యువతరం సేవా సమితి సభ్యులు స్పందించి ఆయన కుటుంబానికి 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. యువతరం అధ్యక్షులు చింత.మురళి, కార్యదర్శి గోరకల.అశోక్, ఇంచార్జిలు దున్న. పెంటరావు, గున్న వెంకటరమణ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణరావుకు అభినందనలు

టెక్కలి : మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న బాడాన నారాయణరావు కోకో జిల్లా అసోసియేషన్ కోశాదికారిగా నియమితులయ్యారు. దీంతో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం టెక్కలిలో ఆదివారం అభినందించారు. మండలానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు జిల్లా అసోసియేషన్‌లో ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, లక్ష్మణరాజా, యరపత్ని వెంకటరమణ, కాపల రఘునాథరావు, నాగళ్ల రమేష్, గజలాపు శ్రీనివాస్, కుప్పిలి ప్రకాష్, యాగాటి త్రినాథరావు, ఆదిశేషు, అలివేణి, నీలకంఠేశ్వరరావు, పాండవుల జగదీష్, నీలయ్య, జగ్గమ్మ పాల్గొన్నారు.

పొందూరులో గ్రంథాలయం ప్రారంభం

పొందూరు : పొందూరు గాంధీనగర్ ఎస్సీ కాలనీలో నూతన గ్రంథాలయాన్ని ఎంఈవో-2 పట్నాన రాజారావు ఆదివారం ప్రారంభించారు. విశ్రాంత ఎంఇఒ రామ్మోహనరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో యువకుల కోసం గ్రంథాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ప్రవేశ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతోపాటు యువతకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని రామ్మోహన్ కుమారుడు సతీష్ తెలిపారు.

క్రీడలతో విలువైన జీవిత పాఠాలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

క్రీడలు మనకు విలువైన జీవిత పాఠాలను నేర్పుతాయని ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సహకారంతో ఉత్తరాంధ్ర ఫుడ్ బాల్ పోటీలు ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ, ఎపిఎఫ్ఎ వైస్ ప్రెసిడెంట్ ముని శ్రీనివాస్ పర్యవేక్షణలో మోడీ కప్ ఫుట్‌బాల్ లీగ్ లో నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకునిఫుట్‌బాల్ లీగ్‌ని నిర్వహించారు. ఈ పోటీలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పాడేరు జిల్లాలకు చెందిన నాలుగు అత్యుత్తమ జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. విశాఖపట్నం


ట్రోఫీని అందిస్తున్న ఈశ్వరరావు

అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఛాంపియన్‌గా నిలవగా, విజయనగరం రన్నరప్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచింది. విజేతలకు చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) చేతుల మీదుగా మెమెంటోలు, పతకాలను అందజేశారు.

చదవడం అలవర్చుకోవాలి

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలను పాడించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే దేశభక్తి గీతాలు నేర్చుకోవాలన్నారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. ముందుఆ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: చదవడం నిత్యం అలవరుచుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. ప్రతి ఆదివారం జరిగే చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులతో దినపత్రికల పఠనం, కథలను స్ఫూర్తినిచ్చే జీవిత చరిత్రలను చదివించారు. విద్యార్థులు మట్టితో గణపతిని తయారు చేశారు.

మంత్రిపై వ్యక్తిగత దూషణలు తగవు

ప్రజాశక్తి- పలాస

స్కిల్ డెవలప్మెంట్ పేరుతో తన సొంత ఏజెన్సీలు ఏర్పాటు చేసి ప్రజలు సొమ్ము కాజేసిన ఆర్థిక నేరస్తుడు చంద్రబాబు నాయుడు అని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ ప్రగతి భవన్ లో ఆదివారం కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, శిష్టు గోపి. బాలయ్య లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అవినీతి కేసులో ముద్దాయిగా చంద్రబాబు నాయుడుని రిమాండ్ విదిస్తే.. దాన్ని ప్రభుత్వం పై రుద్దడం విడ్డూరం అని అన్నారు. కొంతమంది టిడిపి నేతలతో ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడించడం గౌతు శివాజీ, శిరీషాలకు తగదని అన్నారు. మీరు 60 సంవత్సరాలు పరిపాలనలో చేతకాని అభివద్ధి నేడు మంత్రి అప్పలరాజు చేసి చూపిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బోర కష్ణారావు, ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డి. భవాని, ఎఎంసి చైర్మన్ పివి సతీష్, వైసిపి పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

కుమార్ నాయక్‌కు నంది పురస్కారం


నంది పురస్కారం అందుకుంటున్న కుమార్ నాయక్

ప్రజాశక్తి- పలాస

డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలో భాగంగా ఆర్కే కళా సాంస్కతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాన్ ఇండియా కళాకారుడు, సినీ నటుడు కాశీబుగ్గకు చెందిన డాక్టర్ కుమార్ నాయక్‌కు సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు మోగులపల్లి ఉపేంద్ర, ప్రముఖ బెంగాలి సినీ నటి నిషా ప్రాన్సిస్, తెలంగాణా తమిళ కన్నడ సినీ నటి ఖుషి పూరి చేతులు మీదుగా స్వర్ణ కంకణం, నంది పురస్కారాన్ని హైదరాబాద్‌లో అందుకున్నారు. వాడు ఎవడు ? ఓ కౌన్ హై హిందీ డబ్బింగ్ వెర్షన్‌లో సినిమా విడుదలైన సందర్భంగా అందులో కుమార్ నాయక్ తనదైన శైలిలో ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు లభించింది. వీర గున్నమ్మ, సురభి70 ఎంఎం నాకొక శ్రీమతి కావాలి, పలాస, 1978, రెండక్షరాల ప్రేమ తదితర చిత్రాల్లో కుమార్ నాయక్ నటించారు. దివ్య 87, దామిని విల్లా సినిమాకి ఆయనే హీరో. నీ వెంటే నేనుంటా, పాంచాలి, మా ఊరి మంకినమ్మ, లవ్ ఆఫ్ లక్ష్మీపురం, పల్లె గూటికి పండగొచ్చింది, హిట్లర్ (మూడు భాషలు), అంతర్యామి (నాలుగు భాషలు), పాన్ ఇండియా చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. కుమార్ నాయక్ కు నంది అవార్డు రావడం పట్ల ఏపీ ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు శ్రీనివాస్ రాజు, దాసరి నారాయణరావు, కల్చరల్ అకాడమీ అధ్యక్షులు పిఎ భాస్కర్, ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.అనిల్ బాబు, ఫిలిం అసోసియేషన్ విజయవాడ బొర్రా నరసయ్య, అసోసియేషన్ దర్శకులు జి పుర్నేషు హర్షం వ్యక్తం చేశారు.

వాసు ఆదర్శప్రాయుడు


ప్రజాశక్తి- సోంపేట

సాధారణ రైతు కుటుంబంలో పుట్టి వ్యవసాయం చేసుకుంటూ కష్టపడి గ్రూపు త్రీ ఉద్యోగం సాధించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన తెంబ వాసుదేవరావు అందరికీ ఆదర్శప్రాయుడని విశ్రాంత ఐఎఎస్ అధికారి రుంకు అప్పారావు పేర్కొన్నారు. వాసు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సందర్భంగా మండలంలోని కొర్లం గ్రామంలో ఆదివారం ఉదయం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన విధుల్లో చిత్త శుద్ధి చూపించేవారని, అందుకు పదోన్నతులు ఆయన్ని వెదుక్కుంటూ వచ్చాయని అన్నారు. అనంతరం వాసుదేవరావు స్నేహితులు, సన్నిహితులు మాట్లాడుతూ మందస, సోంపేట, పలాస


మాట్లాడుతున్న వినోద్‌బాబు

మండలాల్లో పనిచేసిన సమయంలో ఎన్నో అభివద్ధి పనుల్లో భాగస్వాములయ్యారన్నారు. ఈయనపై రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచన ప్రభావం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.కామరాజు, టి పాండురంగారావు, తులసీదాస్, ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, కె.మోహనరావు, ఎన్. లక్ష్మీనారాయణ, ఐ.మోహనరావు, ఎంపిపి డాక్టర్ దాసు, జెడ్‌పిటిసి ప్రతినిధి జోగారావు, కొర్లం సర్పంచ్ రామ్‌రెడ్డి గణపతి, ఎంపిడిఒ బి.వెంకటరమణ, వాసుదేవరావు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా?


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు చిట్టి

పలాస: పలాస, సోంపేట నియోజకవర్గంలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులు అనుభవించి రెండు ప్రాంతాలలో ఏమి అభివద్ధి చేశారో చెప్పగలరా అంటూ మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి) నిలదీశారు. మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె గౌతు శిరీషను ఎలాగైనా ఎమ్మెల్యే చేసేందుకు తపన, ఆరాటం పడుతూ గత రెండు రోజులుగా మంత్రి సీదిరి అప్పలరాజు పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మీలాంటి నాయకులకు తగదన్నారు. గతంలో అల్లుడు దర్శకత్వంలో తండ్రి, కుమార్తె కలిసి నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారన్నారు. మంత్రి సీదిరి హయాంలో రెండు వందల పడకల ఆసుపత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం, డిగ్రీ కళాశాల మంజూరు, రూ.700 కోట్లు వ్యయంతో మంచినీటి పథకం ఏర్పాటు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక నీచ రాజకీయాలకు దిగడం సమంజసం కాదన్నారు. దివంగత నేత, మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్య దొర హయాంలో రెండు రైల్వే వంతెనలు, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు హయాంలో నియోజకవర్గం పరిధిలోని మారుమూల ప్రాంతాలు అభివృద్ధి చెందాయని అన్నారు. సమావేశంలో సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపీటీసీ తుంగాన రవణమ్మ, మాజీ ఎంపీటీసీ దంతం వైకుంఠ రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

విశ్వకర్మల కోసం ప్రత్యేకంగా బిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమైందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 లక్షల మంది పంచవృత్తుల వారున్నారని, వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ, సహకారాలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రూ.కోటి ప్రభుత్వ నిధులతో ప్రత్యేకంగా విశ్వకర్మల కోసం సామాజిక భవన నిర్మాణం తమ హయాంలోనే చేట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జిల్లా కార్యదర్శి శిమ్మ రాజశేఖర్, యువజన విభాగం అధ్యక్షులు ఎం.వి.స్వరూప్, ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, ఎన్ని ధనుంజయరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శారద పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహాన్ని విశ్వకర్మ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకార, కుమ్మరి, వడ్ల, కంచరి, శిల్ప వంటి వివిధ వత్తులను సష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసేందుకు ఆయన చేసిన కషి సేవలను కొనియాడారు. అనంతరం విశ్వకర్మ ప్రతినిధులు శాలువతో రవికుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దవల అప్పలనాయుడు, విశ్వకర్మ ప్రతినిధులు మబగాపు ఈశ్వరరావు ఆచారి, టేకి ఈశ్వరరావు, నల్లబాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని ఇన్‌ఛార్జి ఎం.నవీన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి అనురాధ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి చెన్నకేశవరావు, పరిశ్రమల శాఖ ఎడి రఘునాథ్, ఎఒ రాజేశ్వరరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు సింహాద్రి ధనుంజరావు, జి.గణపతిరావు, మహిళా అధ్యక్షులు సూర్యకుమారి, తామాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పక్కన మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన విశ్వకర్మ కార్యక్రమంలో ఎస్.పెంటయ్య, ఆర్.సింహాచలం, ఎల్.శ్రీను, పి.గౌరిశంకరరావు, కనకరాజు పాల్నొన్నారు.

ఉత్తమ స్కూల్‌గా శాంతినికేతన్

ప్రజాశక్తి- రణస్థలం

భారతదేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇండియన్ స్కూల్ అవార్డ్స్ ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా నిర్వహించారు. అయితే మొట్టమొదటిసారిగా మారుమూల శ్రీకాకుళం జిల్లాకు చెందిన రణస్థలంలో ఉన్న శాంతినికేతన్ స్కూల్‌కు 'స్కూల్ విత్ న్యూ ఎడ్యుకేషన్ సిస్టం' అనే క్యాటగిరిలో ఉత్తమ స్కూల్‌గా ఎంపికైంది. ఈ కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న అఫిట్ యూనివర్సిటీలో శాంతినికేతన్ సంస్థ డైరెక్టర్ యామల తవిటయ్య ఆదివారం హాజరై ఈ అవార్డును మెంబర్ అఫ్ పార్లమెంట్ రాజ్యసభ సభ్యులు అమర్ పట్నాయక్, అఫిట్ యూనివర్సిటీ ఫౌండర్ కమ్ ఛాన్సర్ సందీప్ మార్వా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తవుడు మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకోవడం ఎంతో అనందంగా ఉందన్నారు. ఈ అవార్డు తనది కాదని, తమ పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందికే చెందుతుందని పేర్కొన్నారు.


అవార్డు అందుకుంటున్న తవుడు

టిటిడి చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్సీ

కవిటి : టిటిడి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని ఎమ్మెల్సీ రామారావు తిరుపతిలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సతీమణి చామంతితో కలిసి వెళ్లిన రామారావు టిటిడి చైర్మన్‌ను దుశ్శాలువతో సత్కరించారు.


టిటిడి చైర్మన్‌తో ఎమ్మెల్సీ దంపతులు

మట్టి వినాయకుని ప్రతిమే మంచిది


పొందూరు: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న గాంధీ

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం


రాష్ట్ర వైస్సార్సీపీ సంయుక్త కార్యదర్శి, ఆమదాలవలస నియోజకవర్గం సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం పొందూరు బస్టాండ్ వద్ద వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ (ఢిల్లీ), వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ఒచాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌతు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 800 మట్టి గణపతి విగ్రహాలను ముఖ్యఅతిథిగా హాజరైన పైడి సెట్టి స్నిగ్ధ చేతులా మీదగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం కషి చేస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్. రోహిత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మట్టి గణపతి విగ్రహాల పోటీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి మల్లేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు తమ, తమ గ్రామాల్లో మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి మండలం బొరివంకలో ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 18వ గణేష్ ఉత్సవ వార్షికోత్సవంలో ఏర్పాటు చేసిన హరిద్ర గణపతి ఆకట్టుకుంటోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వచ్ఛమైన పసుపుతో ప్రముఖ శిల్పి బైరి తిరుపతి ఈ విగ్రహాన్ని తయారుచేశారు.


ఇచ్ఛాపురం : విగ్రహాలను పంపిణీ చేస్తున్న స్నిగ్ధ

మెళియాపుట్టి మండలంలో ప్రతి గ్రామంలో వినాయక విగ్రహాల పూజా కార్యక్రమం నేపథ్యంలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. చేపర, మెళియాపుట్టి, గొప్పిలి, వసుంధర, జాడుపల్లి తదితర గ్రామాల్లో జన సందడి నెలకొంది. అలాగే సరిహద్దులో పర్లాకిమిడి (ఒడిస్సా)కి తాకిడి పెరిగింది. ఈ ఏడాది అధిక శాతం యువకులు విగ్రహాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సాయిప్రియదర్శిని ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న విశాఖ స్కూల్‌లో విద్యార్థులు వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా మట్టి విగ్రహాలను తయారు చేశారు. విశాఖ స్కూల్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఉపాధ్యాయులు అభినందించారు.

బూర్జ మండలం కొల్లివలస బస్టాండ్ వద్ద వినాయక మట్టి విగ్రహాలను రాష్ట్ర వైసిపి సంయుక్త కార్యదర్శి, ఆమదాలవలస నియోజకవర్గం సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ (ఢిల్లీ), వైసిపి నాయకులు పాల్గొన్నారు.


కవిటి : విగ్రహాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రణస్థలం రూరల్ మండలంలోని పైడిభీమవరం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనసేన నాయకులు, వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, నిత్యం మీకోసం సేవా సంఘం అధ్యక్షులు వడ్డాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జే.ఆర్.పురం ఎఎస్ఐ లక్ష్మణరావు చేతులు మీదుగా ఆదివారం వినాయకుడు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పైడిభీమవరం జనసేన నాయకులు పాల్గొన్నారు

శ్రీకాకుళం నగరంలోని సాయిబులతోట వైసిపి యువనేత చౌదరి సతీష్ మట్టి, డాక్టర్ పైడి మహేశ్వరరావు వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొంక్యాన మురళి, కొంక్యాన వేణుగోపాల్, గుడ్ల మల్లేశ్వరరావు, పైడి నిర్మల్‌కుమార్, మెహర్, పైడి చందు, ప్రకాష్, ఇప్పిలి రామకృష్ణ, చిట్టిగాల భాస్కర్, కింతలి శ్రీను పాల్గొన్నారు.

నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, వైద్యులు బొడ్డేపల్లి సురేష్ మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు.